నష్టాల బాటలో మిర్చి రైతులు

- ధరలు తగ్గుముఖం
- పెట్టుబడి కూడా గిట్టుబాటు కాదంటున్న అన్నదాతలు
- మార్కెట్ సౌకర్యం కల్పించాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి

మడకశిరరూరల్: మిర్చి ధరలు తగ్గు ముఖం పట్టడంతో రైతులు నష్టాల్లో కూరుకు పోతున్నారు. ఎన్నడూలేని విధంగా ఈఏడాది ఎండు మిరప కాయల ధరలు పడిపోయాయి. దీంతో రైతులు లబోదిబో మంటున్నారు. ముఖ్యంగా ప్రతి ఏడాది మడకశిర డివిజన్‌లో రైతులు వేరుశనగ పంట సాగు చేసి నష్ట పోతున్నారు. ఈ నేపథ్యంలో ప్రత్యామ్నాయ పంటల వైపు రైతులు మొగ్గు చూపుతున్నారు. గ్రామాల్లో బోరు బావుల కింద మిర్చి పంటను సాగు చేస్తున్నారు. మడకశిర, అమరాపురం, గుడిబండ మండలాల్లో దాదాపు 1700 ఎకరాల్లో రైతులు మిర్చిపంటను సాగు చేశారు. కొంతవరకు పంట దిగుబడి ఆశాజనకంగా ఉండడంతో ఆదాయం బాగా వస్తుందని ఆనందించారు. అయితే మార్కెట్‌లో మిర్చి ధరలు తగ్గు ముఖం పట్టడంతో ఆనందం ఆవిరైందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

గతేడాది ఆశాజనకంగా ధర

గత ఏడాది మిర్చి ధరలు ఆశాజనకంగా ఉండడంతో రైతులు లాభాలబాట పట్టారు. అయితే ఈఏడాది, ధరలు పూర్తిగా తగ్గుముఖం పట్టాయి. గత ఏడాది క్వింటాల్ మిర్చిధర రూ.22,500 వేల వరకూ పలికింది. అయితే ప్రస్తుతం మార్కెట్‌లో క్వింటాల్ మిర్చి ధర రూ.16 వేల నుంచి రూ.17 వేల వరకు మాత్రమే పలుకుతోంది. ఎకరా మిర్చి పంట సాగు చేయడానికి రైతులకు రూ.30 వేల వరకూ పెట్టుబడి పెట్టారు. ధర తగ్గడంతో ఖర్చులు పోనూ ఎకరాకు రూ.25 వేలు మాత్రమే చేతి వస్తుందని చెబుతున్నారు.

మార్కెట్ సౌకర్యం లేక...

ధరలు లేక ఓ వైపు మిర్చి రైతులు ఇబ్బందులు పడుతున్నారు. మరోవైపు స్థానికంగా మార్కెట్ సౌకర్యం కూడా లేకపోవడం మరింత నష్టపోవాల్సిన పరిస్థితి. మడకశిరలో మార్కెట్ యార్డు ఉన్నా కూడా మిర్చి క్రయవిక్రయాలు జరగడంలేదు. మిర్చి రైతులు హిందూపురం మార్కెట్ తరలించాల్సి వస్తోంది. దీంతో రైతులు అదనపు ఆర్థిక భారం పడుతున్నది. కూటమి ప్రభుత్వం చర్యలు తీసుకొని స్థానికంగానే మార్కె సౌకర్యం కల్పించాలని రైతులు కోరుతున్నారు.


మడకశిర వద్ద ఎండబెట్టిన మిరప

ధర తగ్గడంతోనే నష్టాలు



బోరు బావి కింద ఈ ఏడాది ఎకరాకు రూ. 25 వేలకు పైగా ఖర్చు పెట్టి ఐదు ఎకరాల్లో మిరప పంట సాగు చేశాను. పంట దిగుబడి బాగా ఉన్నా మార్కెట్‌లో ధర తగ్గడంతో ఆదాయం తక్కువగానే వస్తుంది. గత ప్రభుత్వంలో ధర బాగా ఉండడంతో ఆదాయం వచ్చింది. ఐదేళ్లుగా మిరప పంటను సాగు చేసి ఆదాయం పొందుతున్నాను. ఈ ఏడాదే ఆదాయం తక్కువగా వస్తోంది.

– శివలింగప్ప, రైతు, ఎల్లోటి, మడకశిర మండలం

గిట్టుబాటు ధర కల్పించాలి



ఈఏడాది మిరప పంట సాగుకు పెట్టిన పెట్టుబడి కూడా గిట్టుబాటు కావడం కష్టంగా ఉంది. బోరు బావి కింద ఎకరాకు రూ.30 వేలు ఖర్చు పెట్టి ఐదు ఎకరాల్లో మిరప పంట సాగు చేశాను. ధరలు తగ్గడంతో పెట్టిన ఖర్చులు పోనూ రూ.80 వేల ఆదాయం మాత్రమే రావొచ్చు. పంట దిగుబడి వచ్చినా కూడా లాభంలేదు. 10 ఏళ్ల నుంచి మిర్చి పంట సాగు చేస్తున్నాను. కూటమి ప్రభుత్వం చొరవ తీసుకొని మిర్చిరైతులకు గిట్టుబాటు ధర కల్పించాలి.

– అంజినప్ప, రైతు, ఎల్లోటి, మడకశిర మండలం

క్లుప్తంగా

బాల్య వివాహాలు చట్ట రీత్యా నేరం


మాట్లాడుతున్న ఐసీడీఎస్ సూపర్‌వైజర్ లీలావతి

మడకశిరరూరల్: మండల పరిధిలోని గుండుమల కస్తుర్బాగాంధీ బాలికల పాఠశాలలో మంగళవారం ఆర్డీటీ, మహిళా శిశు సంక్షేమశాఖ ఆధ్వర్యంలో బాల్య వివాహాలపై అవగాహన కల్పించారు. సూపర్‌వైజర్ లీలావతి మాట్లాడుతూ చిన్న వయస్సులో వివాహాలు చేయడం వల్ల అమ్మాయిలు మానసిక ,శారీరక ఒత్తిడికి గురవడంతో పాటు ప్రసవ సమయంలో తల్లీబిడ్డ ప్రాణాలు కోల్పోతారన్నారు. బాల్యవివాహాలు చేయడం చట్టరీత్యా నేరమని, వివాహం చేసినా, చేసుకున్నా, సహకరించినా శిక్ష పడుతుందన్నారు. కార్యక్రమంలో ఆర్డీటీ టీమ్ లీడర్ అదినారాయణ, ఇన్‌చార్జ్ ఎస్‌ఓ విజేత తదితరులు పాల్గొన్నారు.

ఆలయ నిర్మాణానికి రూ.లక్ష విరాళం


చెక్కు అందజేస్తున్న దృశ్యం

మడకశిరరూరల్: మండల పరిధిలోని బీ రాయాపురం గ్రామంలో నూతనంగా నిర్మిస్తున్న వేంకటేశ్వరస్వామి ఆలయ నిర్మాణానికి ధర్మస్థలం మంజునాథ స్వామి ఆలయ ట్రస్టు పీఓ మహేష్ రూ.లక్ష చెక్కును మంగళవారం కమిటీ సభ్యులకు అందజేశారు. అనంతరం ఆలయ నిర్మాణాన్ని పరిశీలించారు.

జిల్లాస్థాయి పోటీలకు ఎంపిక


జిల్లా స్థాయికి ఎంపికైన రొద్దం ఎంజేపీ విద్యార్థులు

రొద్దం: స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ కొడిగెనహళ్లి ఏపీఆర్ఎస్ స్కూల్ క్రీడా మైదానంలో మంగళవారం నిర్వహించిన డివిజన్ క్రీడా పోటీల్లో ఎంజేపీ బాలుర గురుకుల పాఠశాలకు చెందిన విద్యార్థులు ప్రతిభ చూపారు. జావిలింగ్ త్రో అండర్–17 విభాగంలో జీవన్, సంతోష్, జస్విత్, ముఖేష్, అండర్–14 షటిల్ విభాగంలో మురళీ మనోహర్, ఏషావర్ధన్ జిల్లా స్థాయి పోటీలకు ఎంపికయ్యారని పీఈటీ రామకృష్ణ తెలిపారు.

పావగడ: తాలూకా స్థాయి దసరా క్రీడా పోటీల్లో భాగంగా 400 మీటర్ల పరుగు పందెంలో తాలూకాలోని మేఘలపాళ్య గ్రామానికి చెందిన నందీశ్‌నాయక్ ప్రతిభ చూపి జిల్లా స్థాయి పోటీలకు ఎంపికయ్యాడు. స్థానిక మహాత్మాగాంధీ మైదానంలో నిర్వహించిన పరుగు పందెం పోటీల్లో 11 మంది క్రీడాకారులు పాల్గొనగా నందీశ్ నాయక్ విజేతగా నిలిచాడు. వ్యాయామశాఖ అధికారి విజయ్‌కుమార్, ఉపాధ్యాయురాలు జయమ్మ విజేతకు ప్రశంసపత్రాన్ని అందించారు.

నేడు కలెక్టరేట్ వద్ద 'తాళి బజావ్'

హిందూపురం: కూటమి ప్రభుత్వ వందరోజుల పాలనలో సంక్షేమం, అభివృద్ధి శూన్యం. నిద్రావస్థలో ఉన్న రాష్ట్ర ప్రభుత్వాన్ని నిద్ర లేపేందుకు జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ వద్ద బుధవారం కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో తాళిబజావ్ కార్యక్రమం చేపడుతున్నట్లు డీసీసీ అధ్యక్షుడు ఇనాయతుల్లా తెలిపారు. ఇచ్చిన హామీలను తుంగలో తొక్కి సూపర్ సిక్స్ పథకాలను అటకెక్కించిందని విమర్శించారు. దీనికి నిరసనగా ఉదయం 10 గంటలకు కలెక్టరేట్ వద్ద నిరసన తెలియజేస్తామన్నారు. కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద ఎత్తున తరలివచ్చి కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని కోరారు.

గౌడ చంద్రమ్మదేవికి హారతులు


హారతులు తీసుకెళ్తున్న భక్తులు

అమరాపురం: మండలంలోని ఆలదపల్లి గ్రామంలో దళిత కులస్తులు గౌడచంద్రమ్మదేవికి హారతుల ఉత్సవాన్ని మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళలు తమ ఇంటి నుంచి పిండితో తయారు చేసిన హారతులను చేసుకుని డప్పు వాయిద్యాల మధ్య ఊరేగింపుగా ఆలయం చేరుకున్నారు. అక్కడ అమ్మవారికి హారతులు ఇచ్చి మొక్కులు తీర్చుకున్నారు. అలాగే నిద్రగట్టలో మారెమ్మకు భక్తులు హారతి ఉత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల్లో అమ్మవార్లకు ప్రత్యేక పూజలు నిర్వహించారు.

సెమిస్టర్-2 పాఠ్య పుస్తకాల పంపిణీ

రొళ్ల: మండలంలోని ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు పూర్తి స్థాయిలో పాఠ్యపుస్తకాలు పంపిణీ చేస్తామని ఎంఈఓ శ్రీధర్ పేర్కొన్నారు. మంగళవారం మండలంలోని వన్నరనపల్లి ప్రాథమిక పాఠశాలను ఆయన సందర్శించారు. పాఠశాలల్లో రికార్డులు పరిశీలించారు. తర్వాత విద్యార్థులు, ఉపాధ్యాయుల హాజరు పట్టికను తనిఖీ చేశారు. ఎంఈఓ మాట్లాడుతూ ప్రతి విద్యార్థికి సెమిస్టర్–2 పాఠ్యపుస్తకాలు అందించామన్నారు.

సమగ్ర విచారణ జరపాలి


నిరసన తెలుపుతున్న హిందూ సంఘాలు, వివిధ పార్టీల నాయకులు

హిందూపురం: తిరుమల లడ్డూ ప్రసాదం వివాదంపై సమగ్ర విచారణ చేసి దోషులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేస్తూ హిందూ ఐక్య వేదిక ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. స్థానిక చిన్న మార్కెట్ నుంచి ర్యాలీగా తరలివచ్చి అంబేడ్కర్‌సర్కిల్‌లో మానవహారంగా నిలిచి నిరసన తెలిపారు. అనంతరం తహసీల్దార్ కార్యాలయంలో వినతి పత్రాన్ని అందించారు.

సేవాగుణాన్ని అలవర్చుకోవాలి

హిందూపురం: ఎన్ఎస్ఎస్ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని స్థానిక బాలాజీ, బాలయేసు, ఎస్‌డీజీఎస్, సప్తగిరి కళాశాలల్లో ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించారు. బాలాజీ కళాశాల ప్రిన్సిపాల్ వీరభద్రప్ప మాట్లాడుతూ విద్యార్థులు చదువుతో పాటు సామాజిక సేవాదృక్పథాన్ని కల్గి ఉండాలన్నారు. చదువు విజ్ఞానాన్ని పెంపొందిస్తే సేవా కార్యక్రమాలు సమాజం పట్ల బాధ్యత, సేవాగుణాన్ని పెంపొందిస్తాయన్నారు. బాలయేసు డిగ్రీ కళాశాలలో జరిగిన కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ జియావుల్లాఖాన్ మాట్లాడుతూ సహాయం, సేవతో నలుగురికీ ఆదర్శంగా నిలవాలన్నారు.

పెనుకొండ: పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఎన్ఎస్ఎస్‌డేను మంగళవారం ఘనంగా నిర్వహించారు. ప్రిన్సిపాల్ సుదర్శన్ మాట్లాడుతూ విద్యార్థులు చిన్నవయసు నుంచే సేవా దృక్పథాన్ని అలవరుచుకోవాలన్నారు. పరిసరాల పరిశుభ్రత, మొక్కలు నాటి పరిరక్షించడం, ప్రజల్లో అవగాహన పెంచాలని సూచించారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ వలంటీర్లు, అధ్యాపకులు పాల్గొన్నారు.


బాలయేసు కళాశాలలో మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ జియావుల్లా

ప్రారంభమైన నియోజకవర్గ స్థాయి క్రీడా పోటీలు


షాట్‌పుట్ పోటీలు నిర్వహిస్తున్న దృశ్యం


లాంగ్ జంప్ చేస్తున్న విద్యార్థి

పరిగి: విద్యార్థులలో క్రీడాస్ఫూర్తిని నింపడమే స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ లక్ష్యమని ఎంఈఓలు లక్ష్మీదేవి, శేషాచలం తెలిపారు. మంగళవారం మండలంలోని కొడిగెనహళ్లి ఏపీ స్కూల్ ఆఫ్ ఎక్సలెన్స్ రెసిడెన్షియల్ పాఠశాలలో ఎస్‌జీఎఫ్ ఆధ్వర్యంలో నియోజకవర్గస్థాయి ఆటల పోటీలు, అథ్లెటిక్స్ అట్టహాసంగా ప్రారంభమయ్యాయి. ప్రిన్సిపాల్ ఎన్వీ మురళీధర్‌బాబు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో వారు మాట్లాడుతూ విద్యార్థులు చదువుతో పాటూ క్రీడల్లో రాణించి, జాతీయ అంతర్జాతీయ స్థాయిల్లో రాణించాలని ఆకాంక్షించారు. అనంతరం క్రీడా పోటీలను నిర్వహించి ప్రతిభ కనబరచిన వారిని జిల్లా స్థాయి ఎస్‌జీఎఫ్ ఆటల పోటీలకు ఎంపిక చేసినట్లు తెలిపారు.

మడకశిరలో...

మడకశిర: పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో మంగళవారం బాలికలకు నియోజకవర్గ స్థాయి క్రీడా పోటీలను నిర్వహించారు. స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో పాఠశాల స్థాయిలో నిర్వహిస్తున్న పోటీలను స్థానిక ఎమ్మెల్యే ఎంఎస్ రాజు ప్రారంభించారు. బాడ్మింటన్, ఖోఖో, వాలీబాల్, అథ్లెటిక్స్, కబడ్డీ, యోగా, చెస్ పోటీలను నిర్వహించారు. అండర్–14, అండర్–17 విభాగంలో పోటీలను నిర్వహించి జిల్లాస్థాయి పోటీలకు క్రీడాకారులను ఎంపిక చేశారు. ఎమ్మెల్యే ఎంఎస్ రాజు మాట్లాడుతూ విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో కూడా రాణించాలని సూచించారు. నియోజకవర్గంలోని 5 మండలాల నుంచి 550 మంది బాలికలు క్రీడల్లో పాల్గొన్నారు. స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ జిల్లా కార్యదర్శి మొరార్జీదేశాయ్, నియోజకవర్గ కోఆర్డినేటర్ ప్రకాశ్ రెడ్డి, పీడీలు, పీఈటీలు, మండలాల కోఆర్డినేటర్లు పాల్గొన్నారు.


మడకశిర: వాలీబాల్ పోటీల్లో పాల్గొన్న బాలికలు

తల్లిదండ్రుల ఆశయాలకు అనుగుణంగా ఎదగాలి

హిందూపురం: స్థానిక బిట్ ఇంజినీరింగ్ కళాశాలలో మంగళవారం ప్రేరణ అవగాహన కార్యక్రమం నిర్వహించారు. సదస్సుకు వక్తగా దీప్తి స్కూల్ రెహమన్ రియాజ్ హాజరై మాట్లాడారు. విద్యార్థులు క్రమశిక్షణతో ఉంటూ తల్లిదండ్రుల ఆశయాలకు అనుగుణంగా జీవితంలో ఉన్నత స్థాయికి చేరుకోవాలన్నారు. విద్యార్థులు ఏ సమస్యనైనా ఆత్మవిశ్వాసంతో ఎదుర్కొనేలా మనోధైర్యాన్ని కలిగి ఉండాలన్నారు. స్వామి వివేకానంద శ్లోకాలు అద్భుతంగా వివరించి అర్థాన్ని వివరించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ రమేష్ కళాశాల అధ్యాపకులు విద్యార్థులు పాల్గొన్నారు.

'విద్వేష రాజకీయాలకు పాల్పడుతున్నారు'

పావగడ: స్థానిక ఎమ్మెల్యే వెంకటేశ్ విద్వేషపూరిత రాజకీయాలకు పాల్పడుతున్నారని జేడీఎస్ సీనియర్ నేత, మాజీ ఎమ్మెల్యే కేఎం తిమ్మరాయప్ప ఆరోపించారు. స్థానిక ఎస్ఎస్‌కే సముదాయ భవనంలో మంగళవారం నిర్వహించిన జేడీఎస్ పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. రాష్ట్ర కాంగ్రెస్ ప్రభుత్వం చేపట్టిన ఎలాంటి పథకాలు కార్యరూపం దాల్చడంలేదన్నారు. జేడీఎస్ కార్యకర్తలపై దౌర్జన్యం చేస్తూ అబద్ధపు కేసులు బనాయిస్తున్నారని ఆరోపించారు. అనంతరం జేడీఎస్ సభ్యత్వ నమోదు పుస్తకాలను విడుదల చేశారు. జిల్లా జేడీఎస్ అధ్యక్షుడు ఆర్సీ అంజినప్ప , తాలూకా అధ్యక్షుడు ఎస్‌ఏ ఈరణ్ణ తదితరులు పాల్గొన్నారు.

ప్రకృతి సేద్యంతోనే లాభాలు

- 'పొలం పిలుస్తోంది'లో వ్యవసాయాధికారులు


పెనుకొండ మండలం గుట్టూరులో 'పొలం పిలుస్తోంది'లో పాల్గొన్న అధికారులు , రైతులు


చిలమత్తూరు మండలం మొరసలపల్లిలో ..


అమరాపురంలో పొలంబడి నిర్వహిస్తున్న దృశ్యం

సాక్షిబృందం: ప్రకృతి సేద్యం అటు రైతులకు ఇటు వినియోగదారులకు మేలైన ఆరోగ్యాన్ని కల్పిస్తుందని మండల వ్యవయాసాధికారులు పేర్కొన్నారు. సేంద్రీయ వ్యవసాయం ద్వారా తక్కువ పెట్టుబడి ద్వారా ఎక్కువ ఆదాయం పొందవచ్చన్నారు. హిందూపురం, పెనుకొండ, మడకశిర నియోజకవర్గంలోని వివిధ గ్రామాల్లో 'పొలం పిలుస్తోంది' కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. గ్రామీణ ప్రాంతాల్లోని రైతులు వ్యవసాయంలో యాజమాన్య పద్ధతులు పాటించడం ద్వారా అధిక దిగుబడులు పొందవచ్చని వ్యవసాయాధికారులు సూచించారు. పంట సాగు చేసే ముందు భూసార పరీక్షలు చేయించి ఏ పంటకు భూమి అనుకూలంగా ఉందో పరిశీలించిన తరువాత వ్యవసాయాధికారుల సూచనల మేరకు పంటను సాగు చేయాలన్నారు.

అసాంఘిక కార్యకలాపాలపై ప్రత్యేక దృష్టి

సోమందేపల్లి: మండల కేంద్రంలోని పోలీస్‌స్టేషన్‌ను సీఐ రాఘవన్ మంగళవారం తనిఖీ చేశారు. స్టేషన్ పరిధిలో నమోదవుతున్న కేసులపై ఆరా తీశారు. పేకాట, అక్రమ మద్యం రవాణాపై దృష్టి సారించాలని ఎస్ఐ రమేష్ బాబుకు సూచించారు. అదే విధంగా రోడ్డు ప్రమాదాల నివారణకు చర్యలు చేపట్టాలన్నారు.

రైతులకు సూచనలు

మడకశిరరూరల్: మండల పరిధిలోని సీ కొడిగేపల్లి, బుళ్లసముద్రం పంచాయతీల్లో మంగళవారం ఏఓ తిమ్మప్ప పర్యటించారు. కంది, మొక్కజొన్న, వేరుశనగ పంటను పరిశీలించి రైతులకు పలు సూచనలు, సలహాలిచ్చారు. సెరికల్చర్ అధికారి ప్రతాప్‌నాయక్, రైతు సేవా కేంద్రం సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

క్రీడాదుస్తుల పంపిణీ



క్రీడాదుస్తులను అందిస్తున్న జిల్లా ఫుట్‌బాల్ అసిసోయేషన్ సభ్యులు

హిందూపురం టౌన్: జిల్లా సీనియర్ మహిళా జట్టు మంగళవారం రాష్ట్రస్థాయి పోటీలకు విజయవాడకు బయలుదేరివెళ్లింది. ఈ సందర్భంగా పట్టణంలోని ఎంజీఎం క్రీడా మైదానంలో జిల్లా ఫుట్‌బాల్ సంఘం ఆధ్వర్యంలో జిల్లా అధ్యక్షుడు అనీల్‌కుమార్ ఆధ్వర్యంలో క్రీడాకారులకు క్రీడా దుస్తులను అందజేశారు. ఆయన మాట్లాడుతూ రాష్ట్రస్థాయి పోటీల్లో జిల్లా జట్టు ప్రతిభ కనబరిచి జిల్లాకు మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో కార్యదర్శి మహమ్మద్ సలీమ్, కోశాధికారి శేఖర్, ఎంజీఎం పీడీ లోక్‌నాథ్ తదితరులు పాల్గొన్నారు.

క్వారీ పరిశీలన

సోమందేపల్లి: మండలంలోని పాపిరెడ్డి గ్రామంలో ఉన్న వేలుపు కొండ క్వారీని పోలీసులు, రెవెన్యూ అధికారులు మంగళవారం పరిశీలించారు. క్వారీ వద్ద పేలుళ్ల వలన ఇబ్బందులు పడుతున్నామని కస్తూర్బా పాఠశాల విద్యార్థులు, చెరువు స్థలం ఆక్రమించారని ఇరిగేషన్ అధికారులతో పాటు స్థానికులు ఇటీవల మంత్రి సవితకు ఫిర్యాదు చేశారు. ఈ నేపథ్యంలో సీఐ రాఘవన్, ఇన్‌చార్జ్ తహసీల్దార్ శంకర్, ఎస్ఐ రమేష్ బాబులు క్వారీ వద్దకు వెళ్లి విచారణ చేపట్టారు. ఉన్నతాధికారులకు నివేదిక పంపుతామని వారు తెలిపారు.

ప్లాస్టిక్ నియంత్రణకు కృషి


విద్యార్థులకు బట్ట బ్యాగులను పంపిణీ చేసిన దృశ్యం

పెనుకొండ: విద్యార్థులు ప్లాస్టిక్ నియంత్రణకు కృషి చేయాలని జేవీవీ జిల్లా కార్యదర్శి హరి పిలుపునిచ్చారు. పెనుకొండ నగర పంచాయతీ పరిధిలోని తిమ్మాపురం ఎంపీపీ పాఠశాలలో హెచ్ఎం. రమేష్ అధ్యక్షతన ప్లాస్టిక్ నియంత్రణపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ప్లాస్టిక్ వల్ల కలిగే అనర్థాలను విద్యార్థులకు వివరించారు.

చిలమత్తూరులో భారీ వర్షం


మరవకొత్తపల్లిలో కురుస్తున్న వర్షం

చిలమత్తూరు: మండలంలో పలు చోట్ల మంగళవారం రాత్రి భారీ వర్షం కురిసింది. రాత్రి 7 గంటలకు ప్రారంభమైన వర్షం ఎడతెరిపిలేకుండా గంటకు పైగా కురిసింది. వీధుల్లో భారీగా వర్షం నీరు ప్రవహించింది.

చెత్త తొలగింపు షురూ..


చెత్తను యంత్రాలతో తొలగిస్తున్న దృశ్యం

హిందూపురం: హిందూపురం మున్సిపాల్టీ పరిధిలోని పరిగిరోడ్డు మోతుకుపల్లి వద్ద రెండు మూడు దశాబ్దాలుగా పేరుకుపోయిన చెత్త మేటల తొలగింపు పనులు ప్రారంభమయ్యాయి. 2022లో డంపింగ్ యార్డు చెత్తకుప్పల తొలగింపునకు టెండర్ పిలిచారు. గుంటూరుకు చెందిన జాహనేశ్వర సంస్థ టెండర్ దక్కించుకున్నా పనులు చేపట్టలేదు. ప్రస్తుతం ఆ సంస్థ పనులను ప్రారంభించింది. మూడు నెలల్లోగా చెత్త మేటల తొలగింపు పనులు పూర్తవుతాయని మున్సిపల్ ఇంజనీరింగ్ శాఖ అధికారులు చెబుతున్నారు.

పౌష్టికాహారం తీసుకోవాలి

మడకశిరరూరల్: అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా అందించే పౌష్టికాహారంతో పాటు ఆకుకూరలతో కూడిన ఆహారం తీసుకుని బాలింతలు, గర్భిణులు, చిన్నారులు సంపూర్ణ ఆరోగ్యంగా ఉండాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ లీలావతి తెలిపారు. గుండుమలలో మంళవారం పంచాయితీస్థాయి పౌష్టికాహార మాసోత్సవాలు, సీమంతాలు నిర్వహించారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది, అంగన్‌వాడీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు నిర్మాణ పనులకు భూమిపూజ

గోరంట్ల: మండల పరిధిలోని యర్రయ్యగారిపల్లి నుంచి మేరెడ్డిపల్లికి తారు రోడ్డు నిర్మాణానికి సంబంధించి బీసీ సంక్షేమశాఖ మంత్రి సవిత మంగళవారం భూమి పూజ చేశారు. 1.8 కిలోమీటర్ల మేర తారు రోడ్డు నిర్మాణానికి 1.5 కోట్లు విడుదల చేసినట్లు పంచాయితీరాజ్‌శాఖ అధికారులు తెలిపారు. అంతకు ముందు ఉన్నత పాఠశాలలో దాతలు సమకూర్చిన 10 సైకిళ్లను విద్యార్థులకు మంత్రి చేతుల మీదుగా పంపిణీ చేశారు.

దమ్ము ట్రాక్టర్లతో రోడ్లు ధ్వంసం

- పట్టించుకోని అధికారులు

రొద్దం: దమ్ము ట్రాక్టర్లతో తారు రోడ్లు ధ్వంసం అవుతున్నాయి. దమ్ము చక్రాలకు ఇనుప బద్దీ బిగించుకోకుండా నిబంధనలకు విరుద్ధంగా రోడ్డెక్కుతున్నాయి. దీంతో రూ.కోట్లు వెచ్చించి నిర్మించిన రహదారులు నాశనం అవుతున్నాయి. ఆ శాఖాధికారుల పర్యవేక్షణ కొరవడటంతో రోడ్లు రూపరేఖలు మారిపోతున్నాయి. రొద్దం మండల వ్యాప్తంగా కొన్ని రోజులుగా వ్యవసాయ సీజన్ పనులు ప్రారంభం కావడంతో పంట పొలాలను దమ్ము చేయించి వరి నాట్లు చేపడుతున్నారు. వ్యవసాయ బోర్ల సదుపాయం ఉన్న రైతులు బోర్ల కింద వరి నారుమడులు సిద్ధం చేసి వరినాట్లు చేపడుతున్నారు.


రొద్దం ప్రధాన రహదారిపై వెళ్తున్న దమ్ము ట్రాక్టర్

నిబంధనలకు విరుద్ధంగా..

రహదారులపై దమ్ము ట్రాక్టర్లు యథేచ్ఛగా సంచరిస్తున్నాయి. నిబంధనల ప్రకారం దమ్ము ట్రాక్టర్లు దమ్ము చక్రాలు రోడ్డుపైకి వెళ్లే క్రమంలో ఇనుప బద్దీ బిగించి రాకపోకలు సాగించాలి. అయితే కొందరు ట్రాక్టర్ల యజమానులు ఈ నిబంధనలు పాటించటం లేదు. ఆదేశాలను బేఖతర్ చేస్తూ ఇనుప బద్దీ తగలించకుండానే రోడ్లపై యథేచ్ఛగా సంచరిస్తున్నారు. రోడ్లు చక్రాల కింద నలిగి పూర్తిగా దెబ్బతింటున్నాయి.

పర్యవేక్షణ శూన్యం

నిబంధనలు గాలికొదిలి దమ్ము ట్రాక్టర్లు రాకపోకలు సాగిస్తుండటంతో రోడ్లు పాడవుతున్నాయి. పంచాయతీ రాజ్, ఆర్అండ్‌బీ రహదారులశాఖ పరిధిలోని అన్ని రహదారుల పరిస్థితి అధ్వానంగా తయారవుతున్నాయి. దీంతో వాహనదారులు, స్థానికులు ఇబ్బందులు పడుతున్నారు. అయితే అధికారులు మాత్రం పట్టించుకోవడం లేదు.